నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, గురువారం 17 అక్టోబర్ 2024 | KHAMMAM

**ఆకేరు వరద బీభత్సానికి రాకాశితండా అతలాకుతలమైన విషయం విదితమే. ఊరుఊరంతా సర్వం కోల్పోయి కట్టుబట్టలతోనే మిగిలారు. కొందరి ఇళ్లు కూలిపోయాయి. మరి కొందరి పొలాలు సాగుకు పనికిరాకుండా పోయాయి. ఎటుచూసినా రాళ్లకుప్పలే దర్శనమిస్తున్నాయి. ఆ భయానక ఘటన జరిగి నెలన్నర గడిచిపోయింది. ఇంతవరకు ప్రభుత్వం వారికి అరకొర సాయమే అందించింది. తడిచిన ధాన్యం కొనుగోలు చేస్తామని సాక్షాత్తూ మంత్రి పొంగులేటి హామీ ఇచ్చినప్పటికీ అటువైపు చూసిన నాథుడే లేడు. రూ.16 వేల చొప్పున అందించిన సాయమూ చాలామందికి అందలేదు. దీంతో ఉపాధి కోసం చాలామంది వలసపోతున్నారు. రాకాశితండావాసుల కష్టాలు ఇంకా కడతేరలేదు.**

- హామీ ఇచ్చి పట్టించుకోని మంత్రి పొంగులేటి
- ముగిసిపోని ఆకేరు వరద ముంపు బాధలు
- కొనకపోవడంతో మొలకెత్తుతున్న ధాన్యం
- రాళ్ల కుప్పలుగా మిగిలిన పంట పొలాలు
- వలసబాట పట్టిన రాకాశితండావాసులు

# కడతేరని కష్టాలు



వరద తెచ్చిన కష్టాలు వెళ్లబోసుకుంటున్న రాకాశితండా వాసులు

### అందిన సాయమూ అరకొరే..

రాకాశితండాలో 77 కుటుంబాలకు గాను 66 కుటుంబాల వారికి ప్రభుత్వం రూ.16,500 చొప్పున వారి అకౌంట్లలో జమ చేశారు. మిగిలిన కుటుంబాల వారికి ఒక్కపైసా రాలేదు. దాతలు అందించిన ఆర్థిక సాయం తప్ప ప్రభుత్వం తమకు ఏమీ సాయం చేయలేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. నష్టపోయిన పంటలకూ పైసా ఇవ్వలేదని, కూలిపోయిన ఇళ్లు, కొట్టుకుపోయిన సామాన్లకు పరిహారం చిల్లిగవ్వ అందలేదని చెబుతున్నారు.



రాకాశితండాలో తడిచిన ధాన్యం బస్తాలు

తిరుమలాయపాలెం, అక్టోబర్ 16: తిరుమలాయపాలెం మండలంలోని రాకాశితండావాసులను ముంపు బాధలు వీడలేదు. ఆకేరు వాగు వరద బీభత్సంతో ముంపు ప్రవాహానికి గురై ఇళ్లు కూలిపోయాయి. పంటపొలాలు ఇసుకమేటలు వేశాయి. ఇండ్లలోని సామాన్లు మొత్తం కొట్టుకుపోయాయి. 20మంది రైతులకు చెందిన సుమారు 150 బస్తాల వడ్లు తడిసాయి. ఈ నేపథ్యంలో గ్రామంలో పర్యటించిన రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వారికి స్వయంగా హామీ ఇచ్చారు. కానీ నేటివరకు ఆ తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన నాథుడు లేడు. నష్టపోయిన ప్రజలను అన్నివిధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చినప్పటికీ మంత్రులు, అధికారుల హామీలు అమలుకావడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద ముంపునకు తడిచిన వడ్లను ఎండబెట్టి రాశులు పోసి పట్టాలు కప్పారు. వానలకు మళ్లీ వడ్లు తడిచి మొలకలు వస్తున్నాయి. రాశుల వద్ద కాపలా కాయలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై మంత్రి పొంగులేటికి తమ గోడు వెల్లబోసుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని గిరిజనులు వాపోతున్నారు.

### వలసబాటలో గ్రామస్తులు

ఆకేరు వరద ప్రవాహానికి 50 కుటుంబాలకు చెందిన 300 ఎకరాల్లో పంటలు కొట్టుకుపోయి, వ్యవసాయ భూములు రాళ్ల కుప్పలుగా, ఇసుక మేటలుగా మారాయి. పచ్చని పంటలు పండే భూములు సాగు చేయడానికి పనికి రాకుండా పోయాయి. అట్టి భూములు మళ్లీ సాగు చేసుకునే విధంగా తయారు చేసుకోవాలంటే ఎకరం ఒక్కంటికి రూ.లక్షకు పైగానే ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అయినా ప్రభుత్వం పైసా సాయం కూడా అందించలేదు. దీంతో చేసేదేమీలేక రైతులు కూలీలుగా మారి బతుకు దెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస బాట పడుతున్నారు.



వరి పొలంలో రాళ్ల మేటలు (ఫైల్)

### మంత్రికి మొర పెట్టుకున్నా ఫలితం లేదు..



తడిచిన వడ్లను కొనుగోలు చేస్తామని మంత్రి పొంగులేటి, కలెక్టర్ హామీ ఇచ్చి నెలరోజులైనా ఇంకా కొన్నవారు లేరు. గాలివానలకు పట్టాలు ఎగిరిపోయి వడ్లు తడుస్తున్నాయి. రాశుల వద్ద కాపలా కాయలేక ఇబ్బంది పడుతున్నాము. మా వడ్లు 80 బస్తాలు తడిచి మొలకలు వస్తున్నాయి. ఏమి చేయాలో తోచడం లేదు.

**-పోతుగంటి సహదేవ్, రైతు, రాకాశితండా**

### సర్కారు నుంచి సహకారం శూన్యం..



చాలామంది దాతలు నిత్యావసర వస్తువులు అందించారు. ప్రభుత్వం నుంచి మాత్రం అరకొర సహాయమే అందింది. పంటలు, దెబ్బతిన్న భూములకు చిల్లగవ్వ కూడా ఇవ్వలేదు. మంత్రులు, జిల్లా అధికారులు హామీలు ఇచ్చారు తప్ప అమలు కాలేదు. కొంతమందికి రూ.16 వేలు కూడా రాలేదు.

**-బానోత్ మోహన్, రైతు, రాకాశితండా**



అర్బన్ తహసీల్దార్ ఆఫీసు ఎదుట ధర్నా వద్ద మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత ఆర్జేసీ కృష్ణ

## 'మున్నేరు' బాధితులను ఆదుకోవాలి

- ప్రతి కుటుంబానికీ రూ.3 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి
- అఖిలపక్ష నేతల డిమాండ్
- రూ.16,500 జమ చేయాలి
- ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

రఘునాథపాలెం, అక్టోబర్ 16: మున్నేరు ముంపు ప్రాంత ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. మున్నేరు వరద ఉధృతి ముంపు ప్రాంత ప్రజలకు తీరని నష్టాన్ని మిగిల్చిందని అఖిలపక్ష పార్టీల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు ఆర్జేసీ కృష్ణ, సీపీఎం నాయకులు నున్నా నాగేశ్వరరావు, ఎర్ర శ్రీకాంత్ మాట్లాడుతూ.. మున్నేరు వరద ప్రవాహంతో ముంపు ప్రజలు సర్వస్వాన్ని కోల్పోయారన్నారు. ఇది జరిగి రెండు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబాలకు ఏమాత్రం ఆర్థికసాయం అందలేదన్నారు. కేవలం కంటితుడుపు చర్యగా కొంతమందికి మాత్రమే రూ.16,500 అకౌంట్లో జమ చేసి చేతులు దులుపుకున్నారని అన్నారు. అర్హులైన వందల మంది నిరుపేద బాధితులకు పరిహారం నేటికీ అకౌంట్లో నగదు జమ కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మున్నేరు బాధితులను ఆదుకునేందుకు బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించి తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మున్నేరు ముంపునకు గురైన ప్రతి కుటుంబానికీ రూ.3 లక్షల నష్టపరిహారం అందించాలని కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి కేవలం కట్టుబట్టలే మిగిలాయని, ఒక్కో కుటుంబం 5 నుంచి రూ.10 లక్షల వరకు నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు మాటేటి నాగేశ్వరరావు, రుద్రగాని శ్రీదేవి, ఉపేందర్, మాటేటి కిరణ్‌కుమార్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



వీరన్న పరామర్శ సందర్భంగా మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు

## కేసులకు క్యాడర్ భయపడదు

- పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం
- అధికారులు ఉద్యోగ ధర్మాన్ని మీరితే గుణపాఠం తప్పదు
- భవిష్యత్ మనదే.. ప్రజలతో శ్రేణులు మమేకం కావాలి
- హామీలు అమలుచేయలేక ఈ ప్రభుత్వం చతికిలబడింది
- ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు

తిరుమలాయపాలెం, అక్టోబర్ 16: అక్రమ కేసులకు తమ పార్టీ క్యాడర్ భయపడబోదని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు స్పష్టం చేశారు. తమ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ నేతల అక్రమ కేసుల వల్ల జైలుకు వెళ్లి వచ్చిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్నను, పార్టీ కార్యకర్తలను మండలంలోని జల్లేపల్లిలో బుధవారం ఆయన కలుసుకున్నారు. జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజుతో కలిసి వెళ్లి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన పార్టీ మండల స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో తాతా మధు మాట్లాడారు. మండల ప్రజల్లో మంచి ఆదరణ కలిగిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్నపై.. స్థానిక మంత్రి, కాంగ్రెస్ నేతలు అక్రమ కేసులు బనాయించారని, జైలుకు పంపారని ఆరోపించారు. ఉద్యమాల పురిటిగడ్డ అయిన తిరుమలాయపాలెం బిడ్డలు అక్రమ కేసులకు భయపడబోరని స్పష్టం చేశారు. ఖమ్మంలో మున్నేరు వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన మాజీ హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలు పగడాల నాగరాజు, ఇంటూరి శేఖర్ వంటి వారిపై కూడా తప్పులు కేసులు పెట్టారని దుయ్యబట్టారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ శ్రేణులపై తప్పుడు కేసులు పెట్టాలంటూ పోలీసులపై అధికార పార్టీ నేతలు ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. అధికారులు తమ ఉద్యోగ ధర్మాన్ని పాటించాలని కోరారు. దానిని మీరితే గుణపాఠం తప్పదని అన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తమ ఎన్నికల హామీలను అమలు చేయలేక చతికిలబడిందని విమర్శించారు. భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులన్నీ ప్రజలతో మమేకం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం, బాషబోయిన వీరన్న, అతడి సతీమణి, మాజీ సర్పంచ్ శైలజ, వారి కుటుంబ సభ్యులకు, జైలుకు వెళ్లి వచ్చిన పార్టీ కార్యకర్తలకు తాతా మధు, లింగాల కమల్‌రాజు ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు తిరుమలరావు, సుబ్బారావు, రమణ, శంకర్‌రావు, చావా వేణు, చామకూరి రాజు, కొండబాల వెంకటేశ్వర్లు, మంచానాయక్, వెంకటరెడ్డి, శ్రీను, వెంకన్న, యాదగిరి, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, రవీందర్, వెంకటేశ్వర్లు, జగదీశ్, చందు పాల్గొన్నారు.

## నేడు శబరి స్మృతియాత్ర

- భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో యాత్ర, పుష్పాంజలి



భద్రాచలం, అక్టోబర్ 16: అయోధ్య రాముడి కరుణతో ముక్తి పొందిన గిరిజన మహా భక్తురాలు శబరి స్మృతియాత్ర భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఏటా ఆశ్వయుజ మాసంలో పౌర్ణమి రోజు గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా మహిళలు, యువతుల నృత్యాలు, ఆటపాటల నడుమ యాత్ర నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం 6.30 గంటల నుంచి గిరిప్రదక్షిణ, 8.30 గంటల నుంచి చిత్రకూట మండపంలో నిత్యకల్యాణం, 11.30 గంటలకు వివిధ రకాల పండ్లు, పుష్పాలతో రామయ్యకు పుష్పాంజలి కార్యక్రమం నిర్వహిస్తారు. గిరిజనులు తమ తమ గ్రామాలు, గూడేల్లో లభ్యమయ్యే పూలు, పండ్లను సేకరించి రామయ్యకు సమర్పించడం స్మృతియాత్ర ప్రత్యేకత.

### గిరిజనుల చెంతనే రామయ్య కల్యాణం

భద్రాచలం ఈవోగా రమాదేవి బాధ్యతలు చేపట్టిన తర్వాత గిరిజన గ్రామాలకు ప్రచార రథాన్ని పంపించి అక్కడి ప్రజల మధ్య రామయ్య కల్యాణ మహోత్సవం నిర్వహించడం మొదలుపెట్టారు. దీంతో రామయ్య అందరివాడనే భావన కల్పించడం.. తమ ఇళ్ల ముంగిళ్లలోకి దేవుడే వచ్చాడని గిరిజనులు భావిస్తున్నారు. ఈ ఏడాది అశ్వారావుపేట మండలం వినాయకపురంలో గురువారం శబరి స్మృతి యాత్ర ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు గ్రామంలో రామయ్య ప్రచార రథంతో శోభాయాత్ర నిర్వహించిన తర్వాత ముత్యాలమ్మ ఆలయంలో కల్యాణం నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. ఏపీలోని వీఆర్‌పురం వద్ద ఉన్న శబరి నది సమీపంలో దేవస్థానం ఆధ్వర్యంలో అభిషేకం, వస్త్రాలు, పండ్ల సమర్పణ కార్యక్రమం చేపట్టనున్నారు.

## 481 మంది రిపోర్ట్ 'సర్'

- వివిధ కారణాలతో ముగ్గురి పోస్టింగ్‌లు పెండింగ్
- ఒకరికి రెండు ఉద్యోగాలతో ఒక్క పోస్టుకే ఉత్తర్వులు జారీ
- అభినందనలతో కొత్త టీచర్లను ఆహ్వానించిన హెచ్‌ఎంలు

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 16: డీఎస్సీ-2024లో మంగళవారం అర్ధరాత్రి వరకు నియామక ఉత్తర్వులు అందుకున్న నూతన ఉపాధ్యాయులు బుధవారం జిల్లాలోని తమకు కేటాయించిన పాఠశాలల్లో రిపోర్ట్ చేశారు. 520 మంది వివిధ కేటగిరీలలో డీఎస్సీలో ఎంపిక కాగా.. వారిలో 516 మందికి మాత్రమే పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. 21 మండలాల్లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ స్కూళ్లలో పలు కేటగిరీలలో రిపోర్ట్ చేస్తున్న ఉపాధ్యాయులకు ఆయా పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు, టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సాదర స్వాగతం పలికారు.



కొత్తగా చేరిన టీచర్లతో అర్బన్ ఎంఈవో రాములు, ఉపాధ్యాయ సంఘాల నేతలు

### ముగ్గురికి పెండింగ్..


జిల్లాలోని 520 మంది అభ్యర్థుల్లో 516 మందికి నియామక ఉత్తర్వులు ఇవ్వగా.. ముగ్గురి ఉత్తర్వులను పెండింగ్‌లో పెట్టారు. ఒక అభ్యర్థి రెండు పోస్టులకు ఎంపికయ్యాడు. ఒకటి ప్రభుత్వ స్కూల్స్‌లో స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్, మరొకటి లోకల్‌బాడీలో స్కూల్ అసిస్టెంట్ గణితం ఉన్నాయి. ఈ రెండింట్లో ప్రభుత్వ పరిధిలోని స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్‌ను ఎంపిక చేసుకోవడంతో దానికి సంబంధించిన నియామక పత్రాన్ని అందించారు. మిగిలిన ముగ్గురిలో పలు సర్టిఫికెట్లను పరిశీలనకు అందజేయకపోవడంతో వారికి పోస్టింగ్స్ కల్పించలేదు. ఒక అభ్యర్థి డిగ్రీ సర్టిఫికెట్, మరో అభ్యర్థికి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, ఇంకొకరికి బీసీ-సీలో సర్టిఫికెట్ సమర్పించకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోస్టింగ్‌లు ఇవ్వలేదు.

### తొలిరోజు 481 మంది రిపోర్ట్..

జిల్లాలో 516 మందికి ఉపాధ్యాయులుగా నియామక ఉత్తర్వులు అందించగా.. వారిలో 481 మంది తమకు కేటాయించిన పాఠశాలల్లో హెచ్‌ఎంలకు బుధవారం రిపోర్ట్ చేశారు. కొత్తగా విధుల్లో చేరేందుకు వచ్చిన టీచర్ల నుంచి నియామక ఉత్తర్వులతోపాటు జాయినింగ్ రిపోర్ట్‌ను తీసుకుని రిజిస్టర్‌లో పేరు నమోదు చేశారు. దీంతో అన్ని పాఠశాలల్లో కొత్త ఉపాధ్యాయుల రాకతో కోలాహలం నెలకొంది. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన టీచర్లు స్వీట్లు అందజేయగా.. మిగిలిన ఉపాధ్యాయులు వారికి అభినందనలు తెలిపారు. 35 మంది ఉపాధ్యాయులు ఇంకా రిపోర్ట్ చేయాల్సి ఉంది. పాఠశాలల్లో రిపోర్ట్ చేసేందుకు ప్రభుత్వం 15 రోజుల సమయం ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే చాలా మండలాల్లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన టీచర్లు అక్కడి ఎంఈఓలను కలిశారు. అత్యధికంగా ఖమ్మం అర్బన్ మండలంలో 44 మంది ఉపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించినట్లు ఎంఈవో రాములు తెలిపారు. రిపోర్టింగ్ ప్రక్రియను డీఈవో సోమశేఖర శర్మ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. డీఎస్సీ-2024 ద్వారా కొత్త టీచర్లు రావడంతో అంతకుముందున్న డిప్యూటేషన్, బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేశారు.

## ఏసీ మిర్చి ధర నేలచూపులు

**ఖమ్మంలో ఒక్కరోజులోనే రూ.400 తగ్గుదల**



ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 16: తేజారకం ఏసీ మిర్చి ధర మార్కెట్‌లో రోజురోజుకూ పడిపోతున్నది. దీంతో కోల్డ్‌స్టోరేజీల్లో పంటను నిల్వ పెట్టుకున్న రైతులకు నిరాశ ఎదురవుతున్నది. గతేడాది క్వింటాల్ రూ.22 వేలకు పైబడి పలకడంతో రైతులు కోల్డ్‌స్టోరేజీల్లో పంటను నిల్వ పెట్టుకునేందుకు ఆసక్తి కనపరచలేదు. కోల్డ్‌స్టోరేజీలు వెలవెలబోయాయి. అయితే గత సీజన్‌లో రైతులు, ఖరీదుదారులు భారీగా కోల్డ్‌స్టోరేజీల్లో మిర్చిని నిల్వచేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 45 కోల్డ్‌స్టోరేజీలు ఎర్రబంగారంతో పూర్తిగా నిండిపోయాయి. ప్రస్తుతం అన్‌సీజన్ కావడంతో ధర అధికంగా ఉంటుందనే ఆశతో పంటను అమ్ముకోవాలని చూస్తున్న వారికి నిరాశే ఎదురైంది. రెండునెలల నుంచి ఏసీరకం మిర్చి పంటకు ఖమ్మం ఏఎంసీలో క్వింటాల్ రూ.20 వేలకు మించి పలకలేదు. మంగళవారం జెండాపాటలో రూ.19,500 పలుకగా, బుధవారం రూ.19,100 మాత్రమే పలికింది. ఒక్కరోజు వ్యవధిలోనే రూ.400 తగ్గినట్లైంది. రాబోయే రోజుల్లో ధర పెరుగుతుందా, తగ్గుతుందా అని రైతులు, ఖరీదుదారులు ఆందోళన చెందుతున్నారు.

## ఆర్థిక ఇబ్బందులున్నా ఇందిరమ్మ ఇళ్లిస్తాం

- కుల వృత్తులను ప్రోత్సహించేందుకే కాటమయ్య కిట్లు
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి (నేలకొండపల్లి), అక్టోబర్ 16: ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఈ నెలాఖరు వరకు నియోజకవర్గంలో అర్హులైన 4 వేల మందికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతామని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నేలకొండపల్లిలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో గౌడ కులస్తులకు కాటమయ్య కిట్లను మంత్రి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల వృత్తులను ప్రోత్సహించడంతోపాటు వృత్తి కోసం వినియోగించే కిట్లు, ఉపకరణాలు అందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేశామని, గౌడ కులస్తులకు కాటమయ్య కిట్లు అందిస్తున్నామని చెప్పారు. రైతు రుణమాఫీ విషయంలో ఇప్పటివరకు రూ.18 వేల కోట్లు మాఫీ జరిగిందని, ఇంకా రూ.13 వేల కోట్లు మాఫీ చేయాల్సి ఉందని, వాటిని కూడా చేస్తామని తెలిపారు.

**చదువుతోనే మంచి భవిష్యత్..**


ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చేర్పించాలని మంత్రి పొంగులేటి అన్నారు. మండలంలోని ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో చదివే బాలికలకు పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా సైకిళ్లు పంపిణీ చేస్తున్నామని, నేలకొండపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, ఆర్డీవో గణేశ్, ఎక్సైజ్ ఈసీ వేణుగోపాల్‌రెడ్డి, డీఈవో సోమశేఖర శర్మ, మార్కెట్ చైర్మన్ వెన్నెపూసల సీతారాములు, నాయకులు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, మద్దిమల్లారెడ్డి, వజ్జా రమ్య, నెల్లూరి భద్రయ్య, దండా పుల్లయ్య, రాయపుడి నవీన్, బొడ్డు బొందయ్య, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



నేలకొండపల్లి మండల విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి పొంగులేటి

## భవన నిర్మాణాలకు స్థలాలు

- అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస వసతులు సమకూర్చాలి
- మహిళా, శిశు సంక్షేమ శాఖ సమీక్షలో కలెక్టర్ జితేశ్



మహిళా, శిశు సంక్షేమ శాఖ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): త్వరలోనే జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ఐసీడీఎస్ కార్యాలయాల భవన నిర్మాణాలకు స్థలాలు కేటాయిస్తామని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ చేపడుతున్న ఐసీడీఎస్ కార్యకలాపాలు, చైల్డ్ ప్రొటెక్షన్, అడాప్షన్, చైల్డ్ హెల్ప్‌లైన్‌పై బుధవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు, స్థలం వివరాలు అందజేయాలని సీడీపీవోలను ఆదేశించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల వంటి కనీస వసతులు కల్పించాలని సూచించారు. లోప పోషణకు గురైన పిల్లలను సాధారణ స్థితికి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో మునగ, కరివేపాకు, ఉసిరి, చింత, వెలగ మొక్కలు తప్పనిసరిగా నాటాలని ఆదేశించారు. జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనీనా, ప్రాజెక్టు సీడీపీవోలు, సీడబ్ల్యూసీ మెంబర్లు, డీసీపీయూ యూనిట్, చైల్డ్ హెల్ప్ సిబ్బంది పాల్గొన్నారు.



ఖమ్మం నగరంలో కురుస్తున్న వర్షం

## ఖమ్మం జిల్లాలో మోస్తరు వర్షం

ఖమ్మం వ్యవసాయం/ వైరా టౌన్/ పెనుబల్లి, అక్టోబర్ 16: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం బుధవారం ఖమ్మం జిల్లాలో కన్పించింది. ఉదయం నుంచి మేఘాలు అలుముకోవడంతో వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం, సాయంత్రం సమయంలో ఖమ్మం నగరంతోపాటు నగర శివారు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. 30 నిమిషాలపాటు నగరంలో చెదురుమదురు వర్షం కురవడంతో ద్విచక్ర వాహనదారులు స్వల్ప ఇబ్బందులకు గురయ్యారు. రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే, వైరా మండల కేంద్రంలో మాత్రం సాయంత్రం అర్ధగంటపాటు భారీ వర్షమే కురిసింది. ఇక పెనుబల్లి మండలంలో చిత్రమైన పరిస్థితి కన్పించింది. ఉదయం ఎండ దంచి కొట్టింది. మధ్యాహ్నం మబ్బులు కమ్మాయి. సాయంత్రం వర్షం కురిసింది. అది తగ్గినప్పటి నుంచి ఉక్కపోత మొదలైంది. ఇక్కడ 10 రోజులుగా వాతావరణంలో మార్పులు కన్పిస్తూనే ఉన్నాయి. మబ్బులు, గాలులు లేకుండా ఒక్కసారిగా వర్షం కురుస్తోంది.